క్లుప్తంగా

పౌష్టికాహార పక్షోత్సవాల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది

ఏలూరు (టూటౌన్): పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఏలూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని ఒకటవ సెక్టార్ పరిధిలోని భరత్‌నగర్, ఎంఆర్‌సీ కాలనీ సెంటర్లలో పౌష్టికాహార మేళాలు, ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సెక్టార్ సూపర్‌వైజర్ బి.మంగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలను ఉద్దేశించి మిల్లెట్స్ (చిరుధాన్యాలు) తినటం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, మహిళా పోలీసు సీహెచ్.సౌజన్య, శిరీషా, డి.జయప్రద, కె.వసంత కుమారి, ఎం.బంగారమ్మ, ఎం.తిరుమల, తల్లులు, చిన్నారులు, బాలింతలు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయింపుపై హర్షం



ఎమ్మెల్యే ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలుపుతున్న తూర్పు కాపు సంక్షేమ సంఘ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు తూర్పుకాపుల చిరకాల స్వప్నం నెరవేరిందని సంఘ నాయకులు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే ఆళ్ళ నాని తూర్పు కాపు సంక్షేమ సంఘ కమ్యూనిటీ హాల్‌కు వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించారని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానిని వారు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్ ఉన్నారు.

వైభవంగా శ్రీరామకోటి మహోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 92వ శ్రీ రామకోటి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులతో మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరేరామ సంకీర్తన నిర్వహించారు. రామకోటి పూజలు నిర్వహించారు. పట్టాభిరామ భజన మండలి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణ, హరే శ్రీనివాస కీర్తనలు ఆలపించారు. బుర్రా పద్మనాభుని శర్మ భక్త రామదాసు అనే అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు. శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే ఆళ్ల నాని
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు



శ్రీరామ్ నగర్‌లో కమ్యూనిటీ హాలుకు శంకుస్థాన చేసిన ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఏలూరు క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (టూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సారథ్యంలో నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. నగరంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. స్థానిక శ్రీరామ్ నగర్ 12వరోడ్డులో ఐఎంఏ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేసారు. స్థానిక 3వ డివిజన్ మారుతి నగర్ బాలమ్మ ఇంటి వద్ద ఈడా నిధులతో మారుతీ నగర్ పార్కు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆళ్ల నాని శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక 14వ డివిజన్ పోణంగి సగర్ల పేటలో సగర్ల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముందుగా ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 22 బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాలు, నిధులు కేటాయించామన్నారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగేందుకు వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌కు పట్టం కట్టాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు, కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, 3వ డివిజన్ కార్పొరేటర్ బొద్దాని అఖిల ప్రియ, డిప్యూటీ మేయర్లు గుడిదేసి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్ బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, క్లస్టర్–1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

ఏలూరు (టూటౌన్): ఆర్యవైశ్యులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఆర్యవైశ్యులకు కల్యాణ మండపం నిర్మాణానికి 1100 గజాల స్థలం కేటాయించిన సందర్భంగా ఏలూరు ఆర్యవైశ్య ప్రముఖులు మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నానిని సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి దుశ్శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేసారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ కళ్యాణ మండప నిర్మాణానికి అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి అందజేస్తామని హామీ ఇచ్చారు. ఏలూరు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు అంబికా కృష్ణ పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం

ఏలూరు (టూటౌన్): ఏలూరు 4వ డివిజన్‌లో వెన్నవల్లివారిపేటలోని తూర్పువీధి ముస్లిమ్స్ బాలుర మున్సిపల్ ఫ్రీ హైస్కూల్లో ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు–నేడు పథకంలో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుడు అర్జీ ప్రసాద్ మృతి

ఏలూరు (టూటౌన్): ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మాజీ కోశాధికారి, ఏఐటీయూసీ నాయకులు అర్జీ ప్రసాద్ అనారోగ్యంతో ఏలూరులోని తన స్వగృహంలో సోమవారం మృతి చెందారు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు కలరు. ప్రసాద్ ఏలూరు పురపాలక సంఘంలో పబ్లిక్ హెల్త్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకత్వంలో ఏర్పాటు చేసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, రాష్ట్ర నాయకుడిగా ఎదిగి కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పేర్కొన్నారు. ఓబులేసు ఫోన్ ద్వారా ఏలూరు జిల్లా ఏఐటీయూసీ నాయకులతో మాట్లాడి ప్రసాద్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేసారు. ప్రసాద్ మృతదేహాన్ని ఏఐటీయూసీ నాయకులు రెడ్డి శ్రీనివాస డాంగే, పుప్పాల కన్న బాబు, బీకేయంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు సందర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ ఏలూరు ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణమాచార్యులు, ఏ.అప్పలరాజు తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

ఎన్నికల్లో ఖర్చు పరిమితికి మించకూడదు

డీఆర్వో డి.పుష్పమణి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో డి.పుష్పమణి

ఏలూరు(మెట్రో): ఎన్నికల ఖర్చుపై రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, మార్గదర్శకాలు, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రవర్తనా నియమావళి పాటించేలా వ్యయ పరిశీలకులు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి. పుష్పమణి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, అకౌంటింగ్ బృందం ఏఈవోలు, అకౌంటింగ్ టీమ్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల్లో వీడియో సర్వేలెన్స్ టీంలు (వీఎస్టీ), వీడియో వీవింగ్ టీం (వీవీటీ), ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్), స్టాటిక్ సర్వేలెన్స్ టీంలు (ఎస్ఎస్‌టీ), మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ), అసిస్టెంట్ ఎలక్షన్ అబ్జర్వర్ (ఏఈవో), ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ సెల్‌తో అకౌంటింగ్ టీం సమన్వయం చేసుకుంటూ పని చేయాలన్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు పరిమితికి మించకుండా చూడాల ఎన్నికల వ్యయ పరిశీలక బృంద అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి రూ.95 లక్షలు, అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి రూ.40 లక్షలు అభ్యర్థులు ఖర్చు చేయవచ్చని ఎన్నికల కమిషన్ సూచించినట్లు తెలిపారు. ప్రతి అంశంపై అధికారులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. సందేహాలు ఉంటే నోడల్ అధికారులతో సంప్రదించాలన్నారు.ఎన్నికల సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. మాస్టర్ ట్రైనర్ ఎం.చక్రపాణి మాట్లాడుతూ చట్టపరమైన నిబంధనల ఆధారంగా ఎన్నికల వ్యయాన్ని వర్గీకరించారని వివరించారు. మీడియా సర్టిఫికేషన్ మానటరింగ్ కమిటీ సభ్యులు కె.బాబ్జి ఎన్నికల వ్యయ పరిశీలక బృందాలు నిర్వర్తించాల్సిన వివిధ అంశాలను తెలియజేశారు. ఏలూరు ఆర్డీఓ ఎన్.ఎస్.కె.ఖాజావలి, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ నోడల్ ఆఫీసర్, జిల్లా ఖజానా అధికారి టి. కృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ముక్కంటి, కె.బాబ్జి, ఎంసీఎంసీ సభ్యులు ఎ.ఆలీఖాన్, లోకల్ ఫండ్ జిల్లా కో–పరేటివ్ ఆడిట్, తదితర అధికారులు శిక్షణ నిర్వహించారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు ఎస్‌బీఐ వెల్లడించాలి



స్థానిక ఎస్‌బీఐ ప్రధాన శాఖ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఎస్‌బీఐ బ్యాంకు ఎలక్టోరల్ బాండ్ల వివారలు వెల్లడించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఏలూరు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం సీనియర్ నాయకులు బి.సోమయ్య అధ్యక్షత వహించారు. పార్టీ ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 2018లో ఎన్నికల పేరుతో రాజకీయ పార్టీలకు విరాళాలు సేకరించడానికి ఎలక్టోరల్ బాండ్ పద్ధతి పెట్టిందన్నారు. ఈ బాండ్లు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఎస్‌బీఐ శాఖల్లోనే అందుబాటులో ఉంచారని తెలిపారు. ఈ బాండ్ల ప్రకారం రాజకీయ పార్టీలు తీసుకునే డబ్బులకు ఐటీ వంటి సంస్థలకు కూడా ఎటువంటి లెక్కలు చెప్పనవసరం లేదన్నారు. ఈ విధానంలో 2018–19లో కార్పొరేట్ కంపెనీల నుంచి బీజేపీ రూ.వేల కోట్లు తీసుకుందని విమర్శించారు. 2019 ఎన్నికల్లో ఒక అంచనా ప్రకారం ఈ పద్ధతి ద్వారా రాజకీయ పార్టీలకు రూ.16,437.63 కోట్లు వస్తే దీనిలో ఒక్క బీజేపీకే రూ.10,122 కోట్లు వచ్చాయన్నారు. ఈ పద్ధతి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అందుకే సీపీఎం, కొన్ని ఎన్‌జీఓ సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయన్నారు. దీనిపై ఇటీవల సుప్రీంకోర్టు తీర్పునిస్తూ మార్చి 6 లోగా ఎస్‌బీఐ వివరాలను వెల్లడించాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. జూన్ నెల వరకూ మరింత సమయం కావాలని ఎస్‌బీఐ కోరడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, పి.ఆదిశేషు, పార్టీ నాయకులు వైఎస్ కనకారావు, జె.గోపి, ఎం.ఇస్సాక్, ఆర్ నరసింహామూర్తి, వీవీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇవ్వని పార్టీలకు దూరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో రాజకీయ ప్రాధాన్యత ఇవ్వని పార్టీలకు బ్రాహ్మణులు దూరమవుతారని ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గా ప్రసాద్ స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో బ్రాహ్మణులను గుర్తించి ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని కోరారు. బ్రాహ్మణులను తెలుగుదేశం పార్టీ ఏనాడూ పట్టించుకోలేదని, హిందూత్వం దిశగా ముందుకువెళుతున్న బీజేపీ దేశమంతా బ్రాహ్మణులకు అవకాశాలు కల్పిస్తున్నా రాష్ట్రంలో మాత్రం అన్యాయం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్ సీపీ బ్రాహ్మణులకు నాలుగు స్థానాలు ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో వివిధ పార్టీలు అసెంబ్లీ సీట్ల సర్దుబాటు అనంతరం బ్రాహ్మణులకు కేటాయించిన సీట్లను బట్టి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని బ్రాహ్మణ సంఘాలతో సమావేశం నిర్వహించి కీలక నిర్ణయం తీసుకుంటామన్నారు. విశాఖ, విజయవాడ, రాజమండ్రి ప్రాంతాల్లో ఎన్నికల్లో పోటీ చేయడానికి బ్రాహ్మణులు సిద్ధంగా ఉన్నారన్నారు.

నెలవంక దర్శనంతో నేటి నుంచి రంజాన్



నమాజు చేస్తున్న ముస్లింలు (ఫైల్)

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నెలవంక దర్శనంతో మంగళవారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. ముస్లింల పవిత్ర గ్రంథం దివ్యఖుర్‌ఆన్ అవతరించిన మాసంగా రంజాన్ మాసానికి ప్రత్యేకత ఉంది. క్రమశిక్షణ, దాతృత్వం, ఆధ్యాత్మిక చింతనల మేలు కలయికగా రంజాన్ మాసాన్ని ముసల్మింలు భావిస్తారు. తెల్లవారు జామున షహరీతో ప్రారంభమయ్యే ఈ ఉపవాస దీక్షలు సాయంత్రం ఇఫ్తార్‌తో ముగుస్తాయి. నగరంలోని ముస్లింలు మసీదుల్లో నిర్వహించే నమాజు ప్రార్థనల్లో పాల్గొంటారు. మహిళలు ఇంటి వద్దనే ఉపవాస దీక్ష చేస్తూ దివ్య ఖుర్‌ఆన్ గ్రంథ పఠనం చేస్తారు. నగరంలోని పాత బస్టాండు వద్ద ఉన్న కర్బలా మైదానంతో పాటు వంగాయగూడెం వద్ద ఈద్గాహ్ మైదానంలో ప్రత్యేక నమాజు ప్రార్థనలు నిర్వహిస్తారు. కాగా సోమవారం రాత్రి నెలవంక దర్శనంతో మంగళవారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభించుకోవాలని హైదరాబాద్‌లోని రుయాతే హిలాల్ కమిటీ ప్రతినిధులు ప్రకటించారని ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభించే ముస్లిం సోదరులకు హుస్సేన్ శుభాకాంక్షలు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

ఏలూరు (టూటౌన్): శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ అన్నారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, డీఎస్పీ ఇ.శ్రీనివాసులు ఆదేశాల మేరకు సోమవారం ఏలూరు వన్ టౌన్ ఎస్సై రాజశేఖర్, ఎస్సైలు లక్ష్మణ్ బాబు, రూరల్ ఎస్సై రాజారెడ్డి తమ సిబ్బందితో ఏలూరు వన్‌టౌన్ ప్రాంతమైన బడేటి చౌక్, పాండురంగ థియేటర్ సెంటర్, కత్తేపు వీధి, దక్షిణపు వీధి, చిరంజీవి బస్టాండ్ సెంటర్, వంగాయిగూడెం మీదుగా గాంధీ బొమ్మ సెంటర్ వరకూ ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలీస్, సాయుధ దళాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించుకునేందుకు పోలీస్ శాఖ అన్ని రకాల చర్యలు తీసుకుంటోందన్నారు. ఏ విధమైన వైషమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరూ శాంతిభద్రతలకు సహకరించాలన్నారు. గత ఎన్నికల సమయాల్లో కేసులలో ఉన్నటువంటి వారు ఏవిధమైన సమస్యలను సృష్టించరాదని సీఐ రాజశేఖర్ హెచ్చరించారు.

మహిళలు స్ఫూర్తి ప్రదాతలు



మహిళ సర్పంచ్‌లకు చీరలు అందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: మహిళలు స్ఫూర్తి ప్రదాతలని ఏలూరు రూరల్ ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు కొనియాడారు. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఏలూరులో మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మహిళలు అనేక రంగాల్లో అద్భుత ప్రతిభ చాటుతున్నారని గుర్తు చేసారు. పెదపాడు, దెందులూరు ఎంపీపీ, జెడ్పీటీసీ రత్నకుమారి, లీలా నవకాంతం మాట్లాడుతూ నేడు మహిళలు ప్రజాప్రతినిధులుగా సైతం విజయవంతంగా రాణిస్తున్నారని కొనియాడారు. ప్రోత్సాహం అందిస్తే మహిళలు సమాజంలో అనేక మార్పులకు శ్రీకారం చుడతారని ఎంపీడీఓ ప్రణవి, కార్యదర్శులు సుమలత, లావణ్య అన్నారు. అనంతరం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయంతో పాటు ఏఎస్ఎం, వ్యవసాయ, వెటర్నరీ, ఫిషరీష్, మండల పరిషత్, ఎంఎస్ఆర్ఈజీఎస్ విభాగాల్లో పని చేస్తున్న సుమారు 135 మంది మహిళా ఉద్యోగులకు చీరలు అందజేసారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రభావతి, ఎంఏఓ జీవనసంధ్య, మండల ఏఓ వై సుజాత, ఈఓపీఆర్డీ వై సరళకుమారి, ఏపీఓ కిషోర్, ఎంఈఓ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో విద్యుత్ చోరీకి పాల్పడుతున్న వినియోగదారులపై ఉక్కుపాదం మోపుతామని ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ వీ. రవికుమార్ తెలిపారు. జిల్లాలోని తాడువాయి మండలం పట్టిన్నపాలెం గ్రామంలో ఒక ఫౌల్ట్రీ ఫారంకు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న సమాచారంపై తమ విజిలెన్స్, అధికారులు, సిబ్బంది ఈ నెల 6న ఆకస్మికంగా తనిఖీ చేశారన్నారు. ఈ తనిఖీలో విద్యుత్ అక్రమంగా వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఫౌల్ట్రీ ఫారం జయమానిపై కేసు నమోదు చేసి రూ.1,19992 అపరాధ రుసుము, రూ.12వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	64
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05, 07, 10
బెండకాయలు	24	కంద	64
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	40
కాకర కాయలు	36-44	కీరా దోస	40
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	88
కాలీఫ్లవర్	30	అల్లం	120
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	38-46	పాలకూర	10
దొండకాయలు	24	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	24-28	గోంగూర	08
గోరుచిక్కుడు	32	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

మసీదులకు ఇఫ్తార్ జావా సరుకుల అందజేత



మసీదు పెద్దలకు జావా సరుకులను అందిస్తున్న ఎస్ఎంఆర్ పెదబాబు

ఏలూరు (టూటౌన్): రంజాన్ పండుగను పురస్కరించుకుని ఏలూరు నగరంలోని 27 మసీదులకు 30 రోజులకు సరిపడే రూ.5లక్షలు విలువ చేసే ఇఫ్తార్ జావా సరుకులను నగర కో–ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు సోమవారం ముస్లిం పెద్దలకు అందజేసారు. స్థానిక పవరుపేటలోని మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు క్యాంప్ కార్యాలయంలో ఇఫ్తార్ జావా సరుకులైన రవ్వ, ఆయిల్, పెసరపప్పును మసీదు పెద్దలకు అందజేసారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ పదేళ్లుగా రంజాన్ పండుగను పురస్కరించుకొని నగరంలోని అన్ని మసీదులకు ఇఫ్తార్ జావా సరుకులను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి రోజు ఉపవాస దీక్ష తర్వాత మసీదులో ప్రార్థన చేసి అనంతరం ముస్లింలు జావా స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ కార్పొరేటర్ ఇలియాస్ పాషా, అంజుమాన్ పెద్దలు పలు మసీదులకు చెందిన ఈమాములు, మౌజెన్లు హాజరయ్యారు.

ప్రజా హక్కుల పరిరక్షణకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ కృషి



ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇంజనీర్స్ విభాగం నిర్మాణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్మన్ సంపత్‌కుమార్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజల హక్కులను కాపాడడంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) విశేషంగా కృషి చేస్తోందని ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ పీ సంపత్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక రాయల్ స్టార్ పంక్షన్ హాల్‌లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇంజనీర్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఆర్‌సీ దేశంలోని 9 రాష్ట్రాల్లో విస్తరించి ప్రజల హక్కుల పరిరక్షణ కోసం శక్తివంచన లేకుండా పాటుపడుతోందన్నారు. పలు రాష్ట్రాల్లో మొత్తం 10,500 మంది సభ్యులు స్వచ్ఛందంగా పని చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇంజనీర్స్ విభాగం రాష్ట్ర చైర్మన్‌గా వేల్పుల రాము, అధ్యక్షుడిగా ముని శ్రీనివాసరావు, కార్యదర్శిగా కొమ్మ సాని కమలాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బొందిలి శంకర్‌ను నియమించి వారికి సర్టిఫికెట్లు గుర్తింపు కార్డులు అందజేశారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ నేషనల్ వైస్ చైర్మన్ జీ. కృష్ణకిషోర్, రాష్ట్ర కన్వీనర్ జనరల్ కే. సత్యలక్ష్మి, కే. రమణ, ఇంజనీర్లు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కే జనం మద్దతు



15వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలూరు రూరల్: ప్రజలు మద్దతుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని 15 డివిజన్ కార్పొరేటర్ తంగెళ్ల రాము ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం ఆముదాల అప్పలస్వామి కాలనీ, గాంధీకాలనీ, నేరెళ్లరాజా కాలనీ, వడ్డెరగూడెంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి రాము ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయన్నారు. మరోసారి ఏలూరు ఎమ్మెల్యేగా ఆళ్లనానిని గెలిపిస్తామని ఓటర్లు అంటున్నారని తెలిపారు. ప్రచారంలో డివిజన్ అధ్యక్షుడు అబ్బిరెడ్డి రంగముత్యాలు, ఎలగ అన్నవరం, జయరామ్‌రెడ్డి, ఈపీచర్ల మణిరాజు పాల్గొన్నారు.

నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొంది ప్రభుత్వాన్ని మోసం చేస్తూ ఇప్పటికీ ఉద్యోగాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు గోకవరపు శ్రీను తదితరులు కోరారు. సోమవారం ఆయన ఏలూరులో మాట్లాడుతూ నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొంది అర్హులైన తమలాంటి ఎంతోమందికి ఉద్యోగావకాశాలను దూరం చేసిన వ్యక్తులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆధారాలతో సహా సంబంధిత అధికారులకు అందజేసినా వారిపై ఇప్పటి వరకూ చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంపై ఈపీడీసీఎల్ సీఎండీ, విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన కనిపించలేదని ఆరోపించారు. 2016లో ఈపీడీసీఎల్ పరిధిలో ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరిగాయని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

18 నుంచి కంప్యూటర్ శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఏలూరు వసంతమహాల్ సెంటర్‌లోని కావూరి ఫౌండేషన్‌లో ఈ నెల 18 నుంచి కంప్యూటర్, టైపు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు సంస్థ పౌరసంబంధాల అధికారి పులి శ్రీరాములు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి టాలీలో శిక్షణ ఇస్తారన్నారు. ఏలూరు నగర, పరిసర గ్రామాలకు చెందిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.